కల్తీపై కానరాని నిఘా!





నూడుల్స్

జాడలేని ఫుడ్ ఇన్‌స్పెక్టర్లు
కలర్‌ఫుల్‌గా వంటకాలు
అనారోగ్యం బారిన ప్రజలు



గాజువాక: గాజువాకలో ఆహారపదార్థాల కల్తీ మూడు పువ్వులు, ఆరు కాయలుగా సాగుతోంది. దీనికి చెక్ పెట్టాల్సిన అధికారులు అందుబాటులో లేకపోవడంతో అక్రమార్కులకు అడ్డూ అదుపూ లేకుండా పోతోంది. పప్పు దినుసులు **మొదలు** హోటళ్లలో తినే ఆహార పదార్థాల **వరకు** అన్నింటిలోనూ కల్తీ కామన్ అయిపోయిందని జనం గగ్గోలు పెడుతున్నా కన్నెత్తి చూసే అధికారులు కరువైపోయారు. ఏడాదికోసారి వచ్చి తూతూమంత్రంగా తనిఖీలు చేయడం తప్పా కల్తీకి పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకున్న సంఘటనలు కనిపించడం లేదు. దీంతో అక్రమార్కులు సొమ్ము కోసం ప్రజారోగ్యాన్ని పట్టించుకోకుండా వ్యాపారాలు సాగిస్తున్నారు.

ఫిర్యాదు అందితేనే..

కల్తీని చెక్ పెట్టాల్సిన అధికారులు నిరంతర చర్యలు కానరావడం లేదు. ఏదైనా ఘనట జరిగినప్పుడు.. ఎవరైనా ఫిర్యాదు చేస్తే తప్పా తనిఖీలు చేయడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఆరోపణలు వచ్చినప్పుడు ఆహార భద్రతాధికారులు కేసులు రాయడమే తమ డ్యూటీగా పరిగణిస్తున్నారని మండిపడుతున్నారు.

ఆకర్షణ కోసం కలర్‌ఫుల్

గాజువాకలో హోటళ్లు, స్నాక్స్ రెస్టారెంట్లు భారీ సంఖ్యలో వెలుస్తున్నాయి. యువతను ఆకర్షించడం కోసం ఆయా రెస్టారెంట్లు రకరకాల ఆహార పదార్థాలను అందుబాటులో ఉంచుతున్నాయి. వారిని ఆకర్షించడానికి కలర్‌ఫుల్‌గా సిద్ధం చేస్తున్నారని... వాటి నాణ్యత, రెస్టారెంట్లలో సౌకర్యాలపై అధికారులు స్పందించడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి.

- పాతగాజువాకలోని ఒక రెస్టారెంట్‌లో 100 గ్రాముల కేక్‌కు రూ.60 వసూలు చేస్తున్నారు. ధరలపై నియంత్రణతోపాటు రెస్టారెంట్ల నిర్వహణను పరిశీలించాల్సిన జిల్లా ఫుడ్ క్వాలిటీ కంట్రోల్ అధికారుల జాడ కనిపించడంలేదు.



గ్రీన్‌పీస్

- మార్కెట్లలో పలు పండ్లకు రసాయనాలతో కూడిన రంగులు వేసి విక్రయాలు జరిపిన ఘటనలు వెలుగు చూసిన విషయం తెలిసిందే. రంగు వేసిన పచ్చిబఠానీ విక్రయాలపై అధికారులు గతంలో ఒకే ఒక్కసారి కేసు రాశారు. ఆ తర్వాత అటువైపు చూడడం మానేశారు.
- పండ్ల లో రసాయనాల వాడకం పతాక స్థాయిలో ఉంది. పండ్లను గమనిస్తే అది స్పష్టంగా తెలుస్తుంది. మార్కెట్‌లో కొనుగోలు చేసి ఇంటికి తీసుకొచ్చేసరికి చాలా పండ్ల స్వభావం మారిపోతున్నాయి. అరటిపళ్లు తీయదనానికి బదులు పుల్లగా ఉంటున్నాయని పలువురు వినియోగదారులు గగ్గోలు పెడుతున్నారు.
- మాంసం విక్రయాల్లోనూ అనేకచోట్ల కల్తీ చోటు చేసుకొంటోంది. జీవాలను కబేళావద్ద కాకుండా చాలా ప్రాంతాల్లో దుకాణాల వద్దే వధిస్తున్నారు. మటన్ నాణ్యతపై వినియోగదారులు ఆందోళన చెందుతున్నా ఆహార భద్రతాధికారులకు మాత్రం పట్టడం లేదు.

ఒకే ఒక్కడు

గాజువాక ప్రాంతంలో ఆహార పదార్థాల కల్తీని అరికట్టడానికి నియమించిన ఆహార భద్రతాధికారి జిల్లాలో సగం ప్రాంతాన్ని చూసుకొంటున్నారు. దీంతో ఆయన ఇటువైపు కన్నెత్తి చూసే తీరిక లేకుండా పోయింది. గాజువాక ప్రాంతంలో కేసు రాయాలని ఆయనకు అనిపిస్తే తప్పా ఇటువైపు వచ్చే పరిస్థితి కనిపించడంలేదు. జిల్లాలో ఆహార భద్రతాధికారులు ముగ్గురున్నారు. వారిలో ఒకరు జీవీఎంసీలో భాగమైన గాజువాక, పెందుర్తి జోన్లతోపాటు పలు గ్రామీణ ప్రాంతాల పరిధిలో తనిఖీలు చేయాల్సి ఉంది. ఏరియా పెద్దది కావడంతో ఆయన ఇటువైపు రావడంలేదనే ఆరోపణలున్నాయి. గతంలో జిల్లా ఫుడ్ క్వాలిటీ కంట్రోల్ అధికారులకు జీవీఎంసీ శానిటరీ ఇన్‌స్పెక్టర్లు సహాయకులుగా ఉండేవారు. ఇప్పుడు వారిని ఆ బాధ్యతల నుంచి తొలగించి ఫుడ్ సేఫ్టీ అధికారులే స్వయంగా చూసుకొంటున్నారు. జీవీఎంసీ పరిధిలో ఆహార పదార్థాల నాణ్యత పరిశీలన బాధ్యతలను తమ సిబ్బందికి అప్పటించాలని గతంలో కమిషనర్లు ఫుడ్ సేఫ్టీ కమిషనర్‌కు లేఖ రాసినా స్పందన లేదని జీవీఎంసీ ప్రజారోగ్యాధికారులు తెలిపారు.

క్లుప్తంగా

కోలాట బృందానికి మైక్‌సెట్ అందజేత



కోలాట బృందానికి మైక్ సెట్ అందిస్తున్న పూర్ణ

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడి బీసీ కాలనీలోని వినాయక కోలాట బృందానికి వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు జి.పూర్ణానందశర్మ (పూర్ణ) మైక్‌సెట్ అందించారు. ఈ సందర్భంగా పూర్ణ మాట్లాడుతూ ప్రాచీన భారతీయ కళల్లో కోలాటం ఒకటని, ప్రస్తుతం కోలాటం జానపదంతో పోటీపడుతూ ప్రతీ గ్రామాన కోలాట బృందాలు ఆధ్యాత్మిక సేవలో తరిస్తున్నాయన్నారు. కోలాటం ప్రదర్శించడానికి కొత్త మైక్ సెట్ అవసరమని భావించి అందివ్వడం జరిగిందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ కార్యనిర్వాహక కార్యదర్శి నక్కా రమణబాబు, నాయకులు గళ్ల అప్పారావు, కోలాట గురువు జాజుల అప్పారావు, కోలాట బృంద ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆరోగ్యం ఉంటేనే వృత్తి పరమైన ఎదుగుదల

అగనంపూడి: వృత్తిపరమైన ఎదుగుదలకు మంచి ఆరోగ్యం ముఖ్యమని డీఆర్‌డీఏ సైంటిస్ట్ ఎస్.మురళీధర్ అన్నారు. కాపుజగ్గరాజుపేటలోని విజ్ఞాన్ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం టెక్‌రిడ్జ్–25 జాతీయ మహిళా ఫెస్ట్‌ను ఆయన ప్రారంభించారు. రియాల్టో ష్యూర్ సహ వ్యవస్థాపకురాలు శృతి సాహిని మాట్లాడుతూ యువ మహిళా సాంకేతిక నిపుణులను ప్రోత్సహించేందుకు చక్కటి వేదిక అన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ బి.అరుంధతి మాట్లాడుతూ ఫెస్ట్‌లో వివిధ రాష్ట్రాలకు చెందిన 3600 మంది ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు.

- వేగవంతమైన జీవనశైలిలో విద్యార్థులు మానసిక ప్రశాంతతను కాపాడుకోవల్సిన అవసరం ఉందని మానసిక వైద్య నిపుణురాలు మాధవి గణపతి అన్నారు. దువ్వాడ విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో మానసిక ఆరోగ్యం–ఒత్తిడి నియంత్రణపై శుక్రవారం ఏర్పాటు చేసిన సదస్సులో ఆమె మాట్లాడారు. ఒత్తిడి మనిషి జీవితంలో భాగమైందని, దాన్ని నియంత్రించుకోగలిగితే ఆరోగ్యంగా ఉంటామన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ జె.సుధాకర్, రెక్టార్ వి.మధుసూదనరావు పాల్గొన్నారు.

మత్స్యకారులకు బస్సు సౌకర్యం



బస్సును ప్రారంభిస్తున్న అదానీ గంగవరం పోర్టు సీఈవో అమిత్ మాలిక్

పెదగంట్యాడ: మత్స్యకారుల కోసం అదానీ గంగవరం పోర్టు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తోందని, అందులో భాగంగా వారి కోసం 24/7 రవాణా సౌకర్యం కల్పిస్తున్నామని చెప్పారు. ఈ మేరకు గంగవరం పోర్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బస్సును శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సౌకర్యాన్ని మత్స్యకారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉత్సాహంగా పీస్ పోస్టర్ కాంటెస్ట్



వేసిన చిత్రాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులతో లయన్స్ క్లబ్ ప్రతినిధులు

ఉక్కునగరం: లయన్స్ క్లబ్ స్టీల్ సిటీ ఆధ్వర్యంలో శుక్రవారం బాలబాలికలకు పీస్ పోస్ట్ కంటెస్ట్ నిర్వహించారు. లయన్స్ ఇంటర్నేషనల్ సేవా సంస్థ పిలుపు మేరకు ప్రతీ ఏటా స్కూల్ విద్యార్థులకు ప్రపంచశాంతిపై అవగాహన కల్పించేందుకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా సెక్టార్–1 కేంద్రీయ విద్యాలయంలో నిర్వహించిన పోటీల్లో అనేక మంది విద్యార్థులు పాల్గొన్నారు. లయన్స్ జిల్లా పీస్ పోస్టర్ కాంటెస్ట్ ప్రతినిధి ఎం.ఎస్.ఎన్. మూర్తి మాట్లాడుతూ శాంతి అంటే విద్యార్థులకు అవగాహన కల్పించడానికే ఇలాంటి పోటీలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. పోటీల ద్వారా పిల్లల్లో సృజనాత్మకత, శాంతి భావన, కరుణా గుణం పెంపొందుతాయన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సత్యప్రకాశ్, జిల్లా చైర్ పర్సన్ ఈపూరి బుచ్చిరాజు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్మార్ట్ ఎనర్జీ మీటర్ కోర్సులో శిక్షణకు దరఖాస్తులు

పెదగంట్యాడ: నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (ఎన్‌ఏసీ), ఏపీ స్టేట్ నైపుణ్యాభివద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఎన్‌ఏసీ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్‌వీఎస్ఎస్ రవికుమార్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. జూనియర్ టెక్నీషియన్ స్మార్ట్ ఎనర్జీ మీటర్ కోర్సులో మూడునెలలు శిక్షణ ఇవ్వనున్నామని పేర్కొన్నారు. 18 ఏళ్ల నిండి 40 సంవత్సరాల లోపు వారు అర్హులని పేర్కొన్నారు. మధ్యాహ్నం భోజనంతో పాటు శిక్షణ సమయంలో అవసరమైన స్టేషనరీకి కూడా ఉచితంగా అందజేస్తామన్నారు. మరిన్ని వివరాలకు 8309003957 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

మానసిక దివ్యాంగులకు టీ షర్ట్‌ల అందజేత



టీషర్ట్‌లు, భోజనం అందిస్తున్న ఉక్కు విశ్రాంత ఉద్యోగి ఉమామహేశ్వరరావు

అగనంపూడి: మానసిక ఒత్తిడి, ఆందోళనకు గురై మానసిక వైకల్యం పొందే వారి సంఖ్య పెరుగుతుందని ఉక్కు విశ్రాంత ఉద్యోగి శంకాబత్తుల ఉమామహేశ్వరరావు అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా అగనంపూడి ఆర్‌హెచ్‌సీ కొండయ్యవలసలోని శ్రేయ సేవా సాధన పునరావాస కేంద్రంలోని మానసిక దివ్యాంగులకు ఉమామహేశ్వరరావు తన కుమార్తె దివంగత మణిదీప్తి సంస్మరణార్థం టీ షర్ట్‌లతో పాటు మధ్యాహ్న భోజనం అందించారు. కార్యక్రమంలో నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ, శ్రేయ సేవా సాధన ఇన్‌చార్జి ప్రభు వరప్రసాద్, బి.రమేష్, పి.అచ్యుత్, బి.రాజేష్, కె.సుజాత తదితరులు పాల్గొన్నారు.

దువ్వాడ రైల్వేస్టేషన్ అభివృద్ధికి అభిప్రాయ సేకరణ



వినతిపత్రం అందిస్తున్న దువ్వాడ రైల్వే యూజర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

అగనంపూడి: అమృత్ సంవాద్ కార్యక్రమం ద్వారా ప్రయాణికుల సౌకర్యాలు మెరుగుపర్చడంలో భాగంగా ప్రజా సంఘాలు, ప్రజల అభిప్రాయాలు సేకరిస్తున్నామని తూర్పుకోస్తా రైల్వే వాల్తేరు డివిజన్ ఆపరేషన్ విభాగం ప్రాంతీయ మేనేజర్ ప్రణవ్ జెట్లీ అన్నారు. దువ్వాడ రైల్వేస్టేషన్‌ను ఆయన సందర్శించి ప్రజా సంఘాలతో సమావేశమయ్యారు. అభివృద్ధి కార్యక్రమాలు, రాబోయే రోజుల్లో కల్పించాల్సిన సౌకర్యాలపై తూర్పు కోస్తా రైల్వే కన్సల్టేటివ్ కమిటీ సభ్యుడు కంచుమూర్తి ఈశ్వర్, దువ్వాడ రైల్వే స్టేషన్ యూజర్స్ అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశమై అభిప్రాయాలు స్వీకరించారు. నాలుగు రోజుల కిందట వాల్తేరు రైల్వే డీసీఎం పూజా సింగ్ సందర్శించి ఇక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులు పరిశీలించారు.

వినతులు ఇలా..

శ్రీకాకుళం నుంచి విశాఖ మీదుగా రాజమండ్రి, కాకినాడకు షటిల్ సర్వీస్‌లు నడపాలని, విశాఖ నుంచి బయల్దేరుతున్న రైళ్లకు రెండు నిమిషాల బదులు ఐదు నిమిషాల పాటు హాల్ట్ ఇవ్వాలని కోరారు.

- విశాఖపట్నం – సికింద్రాబాద్ మధ్య నడుస్తున్న వందే భారత్‌కు దువ్వాడ రైల్వేస్టేషన్‌లో హాల్ట్ ఇవ్వాలని, విశాఖ నుంచి షిర్డీ, కొల్లాం, గాంధీధామ్, వారణాసి రైళ్ల ఫ్రీక్వెన్సీని పెంచాలని, విశాఖ తిరుపతి మీదుగా బెంగళూరు, చెన్నైకు రోజువారీ రైళ్లు నడపాలని, దువ్వాడ రైల్వేస్టేషన్‌లో పార్సిల్ సర్వీస్‌లను ఏర్పాటు చేయాలని విన్నవించారు.
- కొన్ని సందర్భాల్లో ఒకటి, నాలుగో నంబర్ ప్లాట్ ఫారాలపై గూడ్స్ రైళ్లు నిలిపివేస్తున్నారని, దీని వల్ల అప్పటికప్పుడు ప్రయాణికులు పరుగులు తీయాల్సి వస్తుందని, ఈ రెండు ప్లాట్‌ఫారాలపై గూడ్స్ రైళ్ల రాకపోకలు నిరోధించాలని ప్రజా సంఘాల ప్రతినిధులు కోరారు. కార్యక్రమంలోయూజర్స్ అసోసియేషన్ ప్రతినిధులు వి.జాషువ, కె.విజయ్‌కుమార్, సరోజినీ, మానవేంద్రనాథ్, రైల్వే అధికారులు రవి, కిరణ్, సురేష్‌బాబు పాల్గొన్నారు.

వైద్య కళాశాలలు ప్రైవేటుకు ఇవ్వడం అన్యాయం



కోటి సంతకాల సేకరణ పోస్టర్ ఆవిష్కరిస్తున్న తైనాల విజయ్‌కుమార్, తిప్పల దేవన్‌రెడ్డి తదితరులు

పెదగంట్యాడ: ప్రభుత్వం నిర్మించిన వైద్య కళాశాలలను (పీపీపీ పేరిట) ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టడం సరికాదని వైఎస్సార్ సీపీ గాజువాక నియోజకవర్గ పరిశీలకుడు తైనాల విజయ్‌కుమార్, నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి అన్నారు. పార్టీ కార్యాలయంలో శుక్రవారం నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన విజయవంతమైందని చెప్పారు. విశాఖ ఎయిర్‌పోర్టు నుంచి నర్సీపట్నం వరకు జననేత జగన్‌కు జనం నీరాజనం పలికారన్నారు. గత ప్రభుత్వ హయాంలో 17 వైద్య కళాశాలలకు అనుమతులు రాగా అందులో 7 కళాశాలలు పూర్తయ్యాయని తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత మెడికల్ కళాశాలలను పట్టించుకోవడం లేదని దుయ్యబట్టారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానం చేశారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత స్టీల్‌ప్లాంట్‌ను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. స్టీల్ యాజమాన్యం ఉద్యోగులు, కార్మికులను భయభ్రాంతులకు గురి చేస్తున్నా స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ స్పందించడం లేదన్నారు. ప్రభుత్వ వైఫల్యాలపై వైఎస్సార్ సీపీ పోరాటాలు చేస్తుందన్నారు. అనంతరం పార్టీ ఆధ్వర్యంలో రూపొందించిన కోటి సంతకాల సేకరణ పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు మార్టుపూడి పరదేశి, పల్లా చినతల్లి, మంత్రి శంకర నారాయణ, మద్దాల అప్పారావు, కోమటి శ్రీనివాసరావు, ఎండీ గౌస్, పూర్ణానందశర్మ, ధర్మాలశ్రీను, బోగాది సన్నీ, పిట్టారెడ్డి, సంపంగి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మరణించినా జీవిద్దాం



అవయవ, శరీర దాన పత్రాలతో ప్రజలు, ఆయా సంస్థల ప్రతినిధులు

శరీర దానానికి 25 మంది అంగీకారం

ఉక్కునగరం: మరణించిన తర్వాత తమ శరీర భాగాలు ఇతరులకు దానం చేయడం అంటే మరణించినా జీవించడమే అని పలువురు వక్తలు అన్నారు. స్పందన చేయూత ఫౌండేషన్, స్టీల్‌క్లబ్, మానవ వికాస వేదిక, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్, మానవత స్వచ్ఛంద సాంఘిక సేవా సంస్థ, సర్వహిత చారిటబుల్ ట్రస్ట్, లయన్స్ క్లబ్ సహకారంతో అఖిల భారత అవయవ మరియు శరీర దాతల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం సీ భవన్‌లో ' అవయవ – శరీర దానం' పై అవగాహన సదస్సు నిర్వహించారు. అఖిల భారత అవయవ దాతల సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ గూడూరు సీతామహాలక్ష్మి మాట్లాడుతూ శరీర, అవయవ దానం వల్ల అత్యవసర పరిస్థితుల్లో ఉన్న వారికి ప్రాణదానం కలుగుతుందన్నారు. బ్రెయిన్ డెత్ అయిన తర్వాత అవయవ దానం ఇస్తే కలిగే ఉపయోగాలను ఆమె వివరించారు. కార్యక్రమంలో 25 మంది శరీర దానం చేయడానికి ముందుకు వచ్చారు. అవయవ దానంలో భాగంగా ఐదుగురు కళ్లు దానం చేయడానికి అంగీకరించారు. సంస్థ కోశాధికారి జ్యోతి, విజయలక్ష్మి, సమన్వయకర్తలు ఎం.ఎస్.ఎన్. మూర్తి, ఈపూరి బుచ్చిరాజు, సీ కార్యదర్శి కె.వి.డి. ప్రసాద్, వివిధ సంస్థల సభ్యులు పి. శ్రీనివాసరావు, గజేంద్రరావు, మాటూరి శ్రీనివాసరావు, ఎ. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వ్యాయామం అవసరం

అగనంపూడి: ఆరోగ్యంగా... ప్రశాంతంగా జీవించడానికి వ్యాయామం అవసరమని కణితి జిల్లా పరిషత్ పాఠశాల హెచ్‌ఎం నరసింగరావు అన్నారు. మేజిక్ బస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం పాఠశాలలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహించారు. హెచ్‌ఎం నరసింగరావు, పీహెచ్‌సీ అధికారి బాబి మాట్లాడుతూ దేశంలో ప్రతీ ఆరుగురిలో ఒకరు ఏదో ఒక రకమైన మానసిక ఆందోళనతో సతమతమవుతున్నారన్నారు. ఒత్తిడి, ఆందోళన, ధూమపానం, మద్యపానం, మాదక ద్రవ్యాల వినియోగం వల్ల ఈ ఒత్తిళ్లు అధికమయ్యాయన్నారు. ఉపాధ్యాయులు శ్రీను, నారాయణరావు, కార్యక్రమంలో మేజిక్ బస్ ప్రతినిధులు సురేంద్రకుమార్, నాగమణి పాల్గొన్నారు.

అట్టహాసంగా ఆలయ ప్రతిష్టాపన మహోత్సవాలు



సామూహిక సహస్ర కుంకుమార్చన నిర్వహిస్తున్న మహిళలు

శాస్త్రోక్తంగా రెండోరోజు కార్యక్రమాలు



విగ్రహాలతో ప్రదక్షిణ చేస్తున్న గ్రామ పెద్దలు

కూర్మన్నపాలెం (గాజువాక): జీవీఎంసీ 87వ వార్డు కణితి కాలనీలో పంచముఖేశ్వరస్వామి దేవాలయ ప్రతిష్టా మహోత్సవాల సందర్భంగా ఆగమ పండితులు శుక్రవారం రెండోరోజు కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం 6 గంటల నుంచి చతుర్వేద పారాయణ, ప్రాతరౌపాసన పునఃపూజలు, హోమాలు, జరిపించారు. దేవతామూర్తుల విగ్రహాలకు భక్తులతో క్షీరాధివాసం చేయించారు. ఈ సందర్భంగా మహిళలతో సామూహిక సహస్ర కుంకుమార్చన నిర్వహించారు. సాయంత్రం ఐదు గంటల నుంచి అర్చనలు, మూలమంత్ర హవనంలు, మహాన్యాసపనం, విశేష అధివాసాలు, పంచేంద్రియాది వాసం, మంత్ర పుష్పాలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను వితరణ చేశారు. కార్యక్రమంలో గ్రామ భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నర్సుల సమస్యలు, సంక్షేమంపై చర్చ

డాబాగార్డెన్స్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో పని చేస్తున్న నర్సుల సమస్యలు, సంక్షేమంపై ఏపీజీఈఏ రాష్ట్ర అధ్యక్షుడు కేఆర్ సూర్యనారాయణ, కార్యదర్శి ఎం.రమేష్‌కుమార్‌తో ఏపీ గవర్నమెంట్ నర్సెస్ వింగ్ ప్రతినిధులు జైతు రవీంద్రనాథ్, వి.ఉషారాణి, జి.శాంతమ్మ, వింగ్ చైర్‌పర్సన్ మంజులాదేవి శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి చర్చించారు. రాష్ట్రంలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అదనపు సిబ్బంది, సహాయక సిబ్బంది నియామకం, స్టాఫ్ నర్స్ అనే పదవి నామకరణాన్ని నర్సింగ్ ఆఫీసర్‌గా మార్చడం, నర్సుల సంక్షేమం కోసం నర్సింగ్ డైరెక్టరేట్ ఏర్పాటు, 55 ఏళ్లు పైబడిన నర్సులను కొండ ప్రాంతాలు, గిరిజన ప్రాంతాలకు బదిలీ చేయకుండా మినహాయింపు తదితర అంశాలపై రాష్ట్ర అధ్యక్షుడితో చర్చించారు. ఆయన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్టు నర్సెస్ వింగ్ ప్రతినిధులు తెలిపారు.

స్టీల్‌ప్లాంట్ ఎస్‌ఐగా శంకరరావు



సీఐ కేశవరావును కలిసిన ఎస్‌ఐ శంకరరావు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ పోలీస్ స్టేషన్ ఎస్‌ఐగా ఎస్.బి. శంకరరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంత వరకు శ్రీకాకుళం జిల్లాలో ఎస్‌ఐగా పనిచేసిన శంకరరావును ఇటీవల జరిగిన బదిలీల్లో ఈ స్టేషన్‌కు ట్రాన్స్‌ఫర్ చేశారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన స్టీల్‌ప్లాంట్ సీఐ కేశవరావును మర్యాదపూర్వకంగా కలిశారు.

‘అంబుజా’ వద్దంటూ విద్యార్థుల ర్యాలీ



గో బ్యాక్ అదానీ, గో బ్యాక్ అంబుజా అంటూ ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

పెదగంట్యాడ: అంబుజా సిమెంట్ పరిశ్రమకు వ్యతిరేకంగా అన్ని వర్గాల ప్రజలు గళం విప్పుతున్నారు. మా ప్రాంతంలో పరిశ్రమ ఏర్పాటు చేసి ఆరోగ్యంతో వ్యాపారం చేయవద్దని.. మా భవిష్యత్ నాశనం చేయవద్దంటూ మండలానికి చెందిన గ్రీన్‌వ్యాలీ పాఠశాల విద్యార్థులు శుక్రవారం మండలంలో పలు ప్రాంతాల్లో ర్యాలీ నిర్వహించారు. గో బ్యాక్ అదానీ, గో బ్యాక్ అంబుజా అంటూ ప్లకార్డులతో పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. స్థానికులు, తల్లి దండ్రులు వారికి మద్దతుగా పాల్గొన్నారు. కాలుష్యం కారణంగా పసిపిల్లలు, వృద్ధుల జీవితాలు నాశనం అవుతాయని అన్నారు. ప్రభుత్వం, అధికారులు చొరవ చూపి ఈ ప్రాంతంలో అంబుజా సిమెంట్ పరిశ్రమ ప్రతిపాదనను రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల నిర్వాహకుడు శ్రీరామూర్తి, సిబ్బంది, పాల్గొన్నారు.

సిరులతల్లికి క్షీరాభిషేకం

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో కె. శోభారాణి తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులు లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఈవో కె. శోభారాణి, ఏఈవో కె.రాజేంద్రకుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేడు సిరులతల్లికి తులసి పూజ..

కనకమహాలక్ష్మి అమ్మవారి దేవాలయంలో శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు తులసిపూజ నిర్వహించనున్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు.

విద్యార్థులు దేశభక్తిని పెంపొందించుకోవాలి

డాబాగార్డెన్స్: విద్యార్థులు దేశభక్తిని పెంపుందించుకోవాలని ఐఆర్‌ఎస్‌ఈ అధికారి వీఆర్ నాయుడు సూచించారు. భారత్ వికాస్ పరిషత్ విశాఖపట్నం శాఖ ఆధ్వర్యంలో నగరంలోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ భవన్‌లో జాతీయ దేశభక్తి బృందగాన పోటీలు, భారత్ కో జానో క్విజ్ పోటీలు జిల్లా స్థాయిలో నిర్వహించారు. నగరానికి చెందిన వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొని హిందీ, సంస్కృత దేశభక్తి గీతాలు, ప్రాంతీయ భాషల్లో జానపద గీతాలు మధురంగా ఆలపించి ప్రతిభ చాటుకున్నారు. పోటీలను కనకమహాలక్ష్మి దేవస్థానం మాజీ చైర్మన్ వంకాయల సన్యాసిరాజు (తాతాజీ) జ్యోతి వెలగించి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి దేశభక్తి, మేధాశక్తి కలిగి ఉండాలని ఆశీస్సులు అందజేశారు. పోటీల అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న వీఆర్ నాయుడు మాట్లాడుతూ విద్యార్థులు దేశభక్తిని పెంపొందించుకుని, బాగా చదువుకుని దేశం గర్వించదగ్గ విద్యార్థులుగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో ఆచార్య పి.అర్జున్, ఎంవీవీ సత్యనారాయణ, భారత్ వికాస్ పరిషత్ విశాఖ శాఖ అధ్యక్షుడు సీహెచ్‌వీ సత్యనారాయణ, కార్యదర్శి పి.భాస్కరరావు, కోశాధికారి జీఎస్‌వీ మాణిక్యాలరావు, ప్రోగ్రామ్ కన్వీనర్లు ఎంఎస్‌ఎల్ శైలజ, ఎంవీ రాజశేఖర్, పంపాన వెంకటేశ్వరరావు, సంస్థ సభ్యులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.